క్లుప్తంగా

షిర్డీ సాయికి ప్రత్యేక పూజలు


బాబాకు పూజలు చేస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో గురువారం సాయి నాథుడికి భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారికి భక్తులు అభిషేకాలు, కాగడ హారతి, నిత్య ప్రార్థన, చందనోత్సవం, అర్చనలు తదితర ప్రత్యేక పూజలు చేశారు.

పంటల నమోదు చేయించుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: సాగు చేసిన పైరును ఈ పంటలో నమోదు చేయించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో గురువారం రైతులకు పంట నమోదు ప్రయోజనాలపై ఏఓ అవగాహనల్పించారు. ఏఈ మాట్లాడుతూ 2024 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను మాత్రమే నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదుతో ప్రభుత్వ పథకాలు రైతులకు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ సిద్దు, వీఏఏలు, ఎంపీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

మంచినీటి పనుల వివరాలు తెలపండి


సమావేశంలో మాట్లాడుతున్న గోనెనాయక్

సి.బెళగల్: గ్రామాల్లో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా చేపట్టాల్సిన మంచినీటి పనుల వివరాలు తెలుపాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్ ఇంజినీర్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గురువారం ఇంజినీర్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేంలో ఆయన మాట్లాడారు. జల్ జీవన్ మిషన్‌లోలో భాగంగా చేపట్టిన సర్వే అంశాలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి పనుల నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న నాయకులు

ఓర్వకల్లు: కేరళ రాష్ట్రంలోని వాయనాడ్ వరద బాధితుల ఆర్థిక సహాయార్థం గురువారం సీపీఎం నాయకులు విరాళాలు సేకరించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, నాయకులు మాసూంబాషా, శ్రీరాములు, శివకుమార్ తదితరులు వరద బాధితుల ఇబ్బందులను దాతలకు వివరించారు. రూ.7500 లు విరాళాలు సేకరించినట్లు రామకృష్ణ తెలిపారు. వాయనాడు జిల్లాలో కొండ చెరియలు విరిగి పడి వందలాది మంది ప్రాణాలు కోల్పోవడం బాధకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో గ్రామ సేవకుడి మృతి

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామ సేవకుడు వెంకటస్వామి(77) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. రెండేళ్లుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వెంకటస్వామిని రెండు రోజుల క్రితం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం వీఆర్‌ఏల సంఘం తరుపున రూ.7 వేలు అందజేసినట్లు సంఘం నాయకులు తెలిపారు.

నాటుసారా స్వాధీనం


వామిదొడ్లో దాచిన నాటుసారాను స్వాధీనం చేసుకుంటున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం బుక్కాపురంలో గురువారం సిబ్బందితో దాడులు చేసి వామిదొడ్లో దాచిన 20లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజినేయులు తెలిపారు. బోయ లక్ష్మీదేవిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. దాడుల్లో సెబ్ సిబ్బంది హనుమంతు, వెంకటేష్ నాయక్, శంకర్‌నాయక్, సువర్ణమ్మ పాల్గొన్నారు.

ఉపాధి ‘వేతనం’ ఏదీ?

- ఉపాధి కూలీలు తప్పని ఆర్థిక ఇబ్బందులు
- రెండు నెలలుగా అందని కూలి
- పనులకు ఇతర గ్రామాలకెళ్తున్న తీరు
- పట్టించుకోని ఉన్నతాధికారులు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కోడుమూరు రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం నెరవేరడం లేదు. ఉన్న ఊర్లోనే వ్యవసాయ కూలీలకు పనులు కల్పించి వలసలు నివారించడం ఈ పథకం లక్ష్యం. అయితే కూలి(వేతనం) సక్రమంగా చెల్లించరకోవడంతో కూలీలకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాభావ పరిస్థితుల మూలంగా వ్యవసాయ పనులు కరువయ్యాయి. ఉపాధి పనులు చేసినా వేతనాలు అందడం లేదు. దీంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణకు ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఉపాధి పథకం కిందనైనా పనులు చేసి కడుపు నింపు కుందామనుకుంటే రెండు నెలలుగా చేసినా పనులకు సంబంధించిన వేతనాలను ప్రభుత్వం నిలిపేసింది. పనుల్లేక ఉపాధి వేతనాలురాక గ్రామాల్లో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి ప్రభుత్వం వేతనాలు చెల్లించకుపోవడంతో తాము కుటుంబాలను ఎలా పోషించుకోవాలంటూ కూలీలు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు వెంటనే మంజూరు చేయాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

ఉపాధి పనులపై తగ్గుతున్న ఆసక్తి

ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించిన వేతనాలను సకాలంలో కూలీల ఖాతాల్లో ప్రభుత్వం జమచేయకపోవడంతో రోజురోజుకు ఉపాధి పనుల పట్ల కూలీలకు ఆసక్తి తగ్గిపోతుంది. ఒక్కోకూలీకి 8నుంచి 10వారాల దాకా చేసిన పనులకు సంబంధించిన కూలీలు రావాల్సి ఉంది. చేసిన పనులకు సంబంధించిన వేతనాలు సకాలంలో మంజూరుగాకా పోవడంతో చాలామంది కూలీలు ఉపాధి పనుల్లోకి వెళ్లడం లేదు. రెండువారాలకు పైగా కోడుమూరు నియోజకవర్గంలో ఉపాధి పనులు సక్రమంగా జరగడం లేదు.

బిల్లులు పంపాం

రెండు నెలల నుంచి కూలీలకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉన్న విషయం వాస్తవమే. ఉపాధి కూలీలు చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వానికి పంపాం. కూలికి సంబంధించిన సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. త్వరలో ఉపాధి కూలీలకు వేతనాలు ఖాతాల్లో జమవుతాయని ఉన్నతాధికారులు చెప్పారు. – మోదీన్, ఏపీఓ, కోడుమూరు

నియోజకవర్గంలోని మండలాల వారీగా ఉపాధి కూలీల వివరాలు

మండలం	ఉపాధి గ్రూపులు	పనిచేస్తున్న కూలీలు
కోడుమూరు	13,070	24,178
గూడూరు	6,455	13,324
సి.బెళగల్	13,649	25,812
కర్నూలు రూరల్	10,544	18,357

అధికారులు పట్టించుకోవడం లేదు



ఉపాధి కూలీల వేతన సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదు. దాదాపు ఎనిమిది వారాల పనులకు సంబంధించి కూలి ఇంతవరకు ఇవ్వలేదు. సకాలంలో కూలి డబ్బులు రాకపోవడంతో కుటుంబాన్ని పోషించుకునేకుందు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కొన్ని రోజులుగా ఉపాధి పనులకూ వెళ్లడం లేదు. అధికారులు స్పందించి ఉపాధి కూలీలకు న్యాయం చేయాలి. – బోయ లక్ష్మిదేవి, ఉపాధి కూలీ

రెండు నెలలుగా వేతనాలు రాలేదు



రెండు నెలలుగా ఉపాధి పనులకు సంబంధించి వేతనాలు రావడం లేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో ఇతర గ్రామాలకు పనులకు వెళ్తున్నాం. ఉల్లినాటు పనులు జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికైనా ఉపాధి వేతనలు మంజూరు చేయాలి. – మల్లీశ్వరీ, ఉపాధి కూలీ

12 నుంచి గ్రామీణ అంశాలపై శిక్షణ

కల్లూరు: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామీణ అంశాలపై మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12,13,14 తేదీలలో మండల పరిషత్ సమావేశ భవనంలో శిక్షణ ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీ పరిపాలన నిర్వహణ, ఎస్‌డబ్ల్యూపీసీ, ఎస్‌హెచ్‌జీ, పారిశుద్ధ్యం, తాగునీరు, పంచాయతీ రాజ్ చట్టం తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణా తరగతులకు రెండు పాస్ ఫొటోలు, ఆధార్‌కార్డు, ఆధార్‌కార్డుకు లింకైన మొబైల్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఈత పోటీలకు రిజిస్ట్రేషన్లు

కర్నూలు (టౌన్): నరసరావుపేట పట్టణంలో ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న 10వ సీనియర్ అంతర్ జిల్లాల ఈత పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేస్తున్నట్లు జిల్లా ఈత సంఘం కార్యదర్శి రామకృష్ణయాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన 15 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన క్రీడాకారులు స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డుతో స్థానిక కిసాన్‌ఘాట్ వద్ద ఉన్న స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ లోపు సంప్రదించాలన్నారు. ఉదయం 9 నుంచి 9.30 గంటల సమయంలో కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే 15 నుంచి 25 ఏళ్ల వయస్సు కలిగిన క్రీడాకారులు వాటర్ పోలోకు అర్హులని తెలిపారు. వివరాలకు 92927 57888 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

చెత్త సేకరణ కేంద్రాలు అందుబాటులోకి తేవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: గ్రామాలలోని చెత్త సేకరణ కేంద్రాలు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీడీఓ శకుంతల తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఈఓఆర్డీ సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్‌లతో కలిసి కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. చెత్త కేంద్రాలకు తరలించి పొడి, తడి, ఘన చెత్త విభాలుగా చెసే ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. ఈనెల 12, 13, 14 తేదీలలో గ్రామ పంచాయతీల నిర్వహణ, అభివృద్ధి ప్రణాళికల తయారీ, గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల పాత్రలపై మూడు రోజులు శిక్షణ కార్యాక్రమాలు ఉంటాయని చెప్పారు.

సమసమాజ స్థాపనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డయ్య

ఓర్వకల్లు: సమసమాజ స్థాపనే సీపీఐ లక్ష్యమని, ఆ దిశగా ఉద్యమాలకు సిద్ధం కావాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప పిలుపునిచ్చారు. అనంతరం పొదుపు భవన్‌లో సమావేశంలో సీపీఐ మండల మాజీ కార్యదర్శి దస్తగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అంబానీ, అధానీలకు ఊడిగం చేస్తుందని, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతుదని విమర్శించారు. ఓర్వకల్లు మండలాన్ని పారిశ్రామిక హబ్‌గా చేస్తామని మాయమాటలు చెబుతూ, రైతుల భూములను బలవంతంగా లాక్కోవడం తప్పా చేసిందేమీ లేదన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రమేష్, సహాయ కార్యదర్శిగా సుధాకర్, సభ్యులుగా మహబూబ్‌బాషా, సుంకులయ్య, మహ్మద్, చంద్ర, బాలరంగస్వామి, చిన్న సుంకన్న, రాజు, వలితో పాటు మొత్తం 15 మందిని ఎన్నుకున్నట్లు గిడ్డయ్య ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రశేఖర్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా సమితి సభ్యులు మహేష్, శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి


పాణ్యంలో పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు

పాణ్యం: నాగుల చవితి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధల మధ్య సాగాయి. వేకువజాము నుంచి మహిళలు సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. మండల కేంద్రం పాణ్యంతోపాటు గ్రామాల్లో నాగుల కట్టలు, పుట్టలకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలలో పాలుపోసి నాగదేవతలను స్మరించుకున్నారు. నాగుల దేవతలకు నువ్వులు, చలివిపిండి నేవేద్యంతోపాటు నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాణ్యం బస్టాండ్‌లో వెలసిన పుట్ట ప్రాంగణం మహిళలతో నిండిపోయింది.

కిటకిటలాడిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం

మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం నాగుల చవిత సందర్భంగా గురువారం భక్తులతో కిటకిటలాడింది. ఈఓ రామక్రిష్ణ ఆధ్వర్యంలో నాగులచవితి వేడుకలు వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. నూతన వధూవరులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సి.బెళగల్: మండలంలో గురువారం నాగుల చవితి వేడుకలను ఘనంగా జరిగాయి. శ్రావణమాస చవితి సందర్భంగా ఉదయం నుంచే మహిళలు నాగులకట్టలకు చేరుకుని నాగుల విగ్రహాలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళలు పుట్టల వద్దకు వెళ్లి నాగదేవతలకు పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా నూతన వధూవరులు పుట్టలకు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.


కొత్తూరులో నాగులకట్ట పూజలు చేస్తున్న భక్తులు


సి.బెళగల్‌లోని ఈశ్వరాలయం నాగులకట్ట దగ్గర పాలుపోస్తున్న మహిళలు


శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి పూజల్లో ఈఓ రామక్రిష్ణ, సిబ్బంది

ముగిసిన ఎస్‌ఎంసీ ఎన్నికలు


మద్దూరు ఉన్నత పాఠశాల చెర్మన్‌గా ఎన్నికైన విజయను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాణ్యం: ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాతంగా జరిగాయి. అధికారి పార్టీ నాయకులు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఏకగ్రీవం చేసుకునేందుకు అన్నిప్రయత్నాలు చేశారు. పలుచోట్లా ఏకగ్రీవాన్ని అంగీకరించకపోవడంతో ఓటింగ్ పెట్టారు. ఉదయం ఆయా పాఠశాలలో హెచ్‌ఎంల ఆధ్వర్యంలో తల్లిందడ్రుల సమావేశం నిర్వహించి సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు చెర్మన్, వైస్ చెర్మన్‌లను ఎన్నుకున్నారు. పాణ్యం మండలం మద్దూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల చెర్మన్‌గా విజయ గెలుపొందారు. వైస్ చెర్మెన్‌గా మధుసుధాకర్ ఎన్నికయ్యారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన రెగ్యూలర్ పాఠశాల చెర్మన్‌గా కె. లావణ్య, వైస్ చెర్మన్‌గా సుబ్బరాయుడు ఎన్నిక జరిగింది. వీరిని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి, మహింద్రారెడ్డి, చంద్రారెడ్డి, మాధవరెడ్డి అభినందించారు.

కల్లూరు: మండలంలోని గ్రామీణ, అర్బన్ పాఠశాలలో ప్రశాంతంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ-1 శ్రీనివాసులు, ఎంఈఓ-2 వనజ కుమారి తెలిపారు. 43 పాఠశాలలో చైర్మన్లు, వైఎస్ చైర్మన్ల ఎన్నికల ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంఈఓలు తెలిపారు. మిగతా 33 పాఠశాలలో ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు.

చెల్లని అధికారపార్టీ నాయకుల ఎత్తులు

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు తమ ఇష్టం మేరకే జరగాలని అధికారపార్టీ నాయకులు ఎత్తులు చెల్లలేదు. కల్లూరు గ్రామీణ, అర్బన్ పాఠశాలలో గురువారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో టీడీపీ నాయకులకు ఎదురుదెబ్బ తగిలింది. రెమడూరు, ఎ.గోకులపాడు పాఠశాలలో టీడీపీ నాయకులు అంచనాలు తారమారయ్యాయి. రెమడూరు ప్రాథమిక పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్‌గా శివశంకర్, వైస్ చైర్మన్‌గా వరలక్ష్మి విజయం సాధించారు. ఎ.గోకులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్‌గా వి. కృష్ణ, వైస్ చైర్మన్‌గా కె. తిరుపత్తమ్మ విజయం సాధించారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, విక్రమసింహారెడ్డి, అభీ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గురువారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతగా జరిగాయి. అధికార పార్టీ నాయకులు తమ బలాన్ని ప్రదర్శించారు. చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడంతో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఓర్వకల్లు జెడ్పీ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ స్కూల్, నన్నూరు జెడ్పీ హై స్కూల్, హుసేనాపురం, మీదివేముల జెడ్పీ హై స్కూల్, లొద్దిపల్లె ప్రభుత్వ హై స్కూల్, శకునాల జెడ్పీ హై స్కూల్, ఉయ్యాలవాడ జెడ్పీ హై స్కూల్‌లలో సంజీవరాజు, అయూబ్‌బాషా, ధర్మావతి, జాకీర్ ఉస్సేన్, డి.మధు, మహాలక్ష్మీ, నాగస్వామి, మదనమోహన్, శేఖర్‌తో పాటు, మొత్తం 48 మంది చైర్మన్లు, 48 వైస్ చైర్మన్లుగా ఎన్నికైనట్లు ఎంఈఓ ఓంకార్ యాదవ్ తెలిపారు.


ఎన్నికలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ వనజ కుమారి



ఓర్వకల్లు జెడ్పీ హై స్కూల్‌లో జరిగిన ఎన్నికల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఇదేం చోద్యం!

- అధికారపార్టీ నాయకుల హుకుం... తలొగ్గిన మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్
- మొదట ఒకరితో.. వెంటనే ఇంకొకరితో ప్రమాణ స్వీకారం చేయించిన వైనం
- ఈ ఘటనకు పోలీసులే ప్రత్యక్ష సాక్ష్యం

పాణ్యం: రాజకీయాలకు అతీతంగా నిర్వహించాల్సిన ఎస్‌ఎంసీ చెర్మన్ ఎన్నికలలో టీడీపీ నాయకులు తమ అధికార బలాన్ని ప్రదర్శించారు. అధికార బలానికి పాణ్యం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తలొగ్గాల్సి వచ్చింది. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యులూ పోలీసులే. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో తల్లిందడ్రులతో సమావేశం నిర్వహించిన ప్రిన్సిపాల్ దినేష్‌బాబు సభ్యుల ఎంపిక చేశారు. ఈక్రమంలో చెర్మన్ పదవి కోసం ముగ్గురు పోటీపడ్డారు. మొత్తం 15 మంది సభ్యులు ఉండగా సుగాలిమెట్టకు చెందిన లక్ష్మానాయక్‌కు తొమ్మిదిమంది మద్దతు తెలిపారు. దీంతో ప్రిన్సిపాల్ లక్ష్మానాయక్‌తో పోలీసుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించి సంతకాలు తీసుకున్నారు కూడా. ఎన్నిక పూర్తి కావడంతో అందరు వెళ్లిపోయారు. అయితే కొద్ది నిమిషాల వ్యవధిలోనే సీన్ మారిపోయింది. టీడీపీ నాయకులు హుకుం జారీ చేసినట్లు సమాచారం. దీంతో ప్రిన్సిపాల్ చెర్మన్‌తోపాటు సభ్యులను మళ్లీ పిలిపించారు. అదేవిధంగా పోలీసులు సైతం అక్కడకు చేరుకుని రవినాయక్‌ను ఎన్నికై నట్లు ప్రకటించారు. ప్రమాణ స్వీకరం చేయించారు కూడా. పోలీసుల సాక్షిగా జరిగిన ఈ ఘటనతో సభ్యులు విస్మయానికి గురయ్యారు. విషయం తెలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు సైతం అధికారుల తీరుపై మండిపతున్నారు. ఇదేం చోద్యం అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.

ప్రశాంతంగా స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు


కోడుమూరు మోడల్ స్కూల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలను నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి


అమడగుంట్ల హైస్కూల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలను పరిశీలిస్తున్న కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్

కోడుమూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కోడుమూరు నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, కర్నూలు రూరల్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంలు విద్యార్థుల తల్లిదండ్రులతో ఎన్నికలను నిర్వహించారు. కోడుమూరు మండలంలో మొత్తం 54పాఠశాలలుండగా, 49పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను హెచ్‌ఎంలు నిర్వహించగా, లద్దగిరి హైస్కూల్, అమడగుంట్ల హైస్కూల్, రెండు ప్రాథమిక పాఠశాలలు, కోడుమూరులోని కస్తూర్బా పాఠశాలల్లో కోరం లేక హెచ్‌ఎంలు ఎన్నికలను వాయిదా వేశారు. అలాగే గూడూరు మండలంలో 33ప్రభుత్వ పాఠశాలల్లోనూ, కర్నూలు రూరల్ గ్రామాల్లోని74 ప్రభుత్వ పాఠశాలల్లోనూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

ఎన్నికలను పర్యవేక్షించిన కర్నూలు డీఎస్పీ

కోడుమూరు మండలంలోని అమడగుంట్ల గ్రామంలో కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, కోడుమూరు సీఐ మన్సురుద్దీన్‌లు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలని గ్రామస్తులకు డీఎస్పీ సూచించారు.

మూడు ఎస్‌ఎంసీ ఎన్నికలు వాయిదా

సి.బెళగల్: మండలంలో గురువారం జరగాల్సిన ఎస్‌ఎంసీ ఎన్నికలకు సంబంధించి మూడు పాఠశాలలో వాయిదా వేసినట్లు ఎంఈఓ జ్యోతి తెలిపారు. మండలంలో 31 పాథమిక, 3 ప్రామికోన్నత, 9 జిల్లా పరిషత్, మోడల్, కేజీబీవీ, గురుకులం పాఠశాలలో మొత్తం 46 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. కంబదహాల్ గ్రామ మెయిన్, బీసీ ప్రాథమిక పాఠశాలలతో పాటు, కే.సింగవరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సైతం ఎన్నికకు సరైన కోరంలేక హెచ్‌ఎంలు వాయిదా వేసినట్లు ఎంఈఓ తెలిపారు. సి.బెళగల్, బురాన్‌దొడ్డి, కంబదహాల్, మారందొడ్డి, పోలకల్, ముడుమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎంసీ చైర్మన్లుగా ముందరింటి గోవిందు, వెంకటేశ్వర్లు, రాముడు, పద్మావతి, పూజారి రామయ్య, నరసింహుడు ఎన్నికయ్యారు. అదేవిధంగా మోడల్ స్కూల్ చైర్మన్‌గా తిప్పన్న ఎన్నికయ్యారని తెలిపారు.


సి.బెళగల్ కొటారు మిట్ట స్కూల్లో విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేస్తున్న చెర్మన్ వీరేష్

పాఠశాల అభివృద్ధికి తోడ్పడండి


కాటసాని రాంభూపాల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కల్లూరు: బాగా పని చేసి పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. గురువారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో రెమడూరు గ్రామంలో చైర్మన్‌గా పి.శివశంకర్, వైఎస్ చైర్మన్‌గా ఎస్. వరలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు కాటసాని రాంభూపాల్‌రెడ్డిని కలసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా కాటసాని వారికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, సుధాకర్, సురేష్, రంగన్న, వెంకటేశ్వర్లు, యుగంధర్, కర్రెన తదితరులు పాల్గొన్నారు.